ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవ


కైలాసగిరిపై చెత్త సేకరిస్తున్న విద్యార్థినులు


జూలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న జూ అధికారులు, ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు


ఎంవీపీ రైతుబజార్‌లో..

ఆరిలోవ: నగరంలోని పర్యాటక కేంద్రాలలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ఇందిరాగాంధీ జూ పార్కు, కైలాసగిరి పరిసరాలను పలువురు శుభ్రం చేశారు. జూలో అధికారులు, సిబ్బంది, ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం వలంటీర్లు, జీఎస్టీ అధికారులు సంయుక్తంగా జూ లోపల, జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ కవర్లు, పిచ్చి మొక్కలు, పేపరు ప్లేట్లు సేకరించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ నందనీ సలారియా, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జీఎస్టీ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్, జాయింట్ కమిషనర్ నాగార్జున, అసిస్టెంట్ కమిషనర్ పి.సురేష్ పాల్గొన్నారు.

- సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కైలాసగిరిపై ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సేకరించారు. చీపుర్లు పట్టుకుని పరిసరాలను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను డబ్బాల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అప్పగించారు. నగరంలో పలు కళాశాల విద్యార్థులు కూడా కైలాసగిరిపై స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు.
- స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమై తొమ్మిదేళ్లు విజయవంతంగా పూర్తి కావడంలో జీవీఎంసీ పరిధిలోని వార్డులు, పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఆదివారం శుభ్రం చేశారు. వార్డుల్లో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు చేపట్టారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డులో కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో విశాలాక్షి నగర్, జోడుగుళ్లపాలెంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పదో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు, 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో, 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో, 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎంవీపీ రైతుబజార్‌ను ఈవో జి.ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది, రైతులు చేపుర్లు చేతపట్టి శుభ్రం చేశారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో రజక వీధి కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, మహిళా శిశు సంక్షేమశాఖ అసిస్టెంట్ సీడీపీవో శ్రీలత తదితరులు పాల్గొని కాలనీలోని రోడ్లను చీపుర్లతో ఊడ్చారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మన పరిసరాలు, మన కాలనీ, మన ఇల్లు శుభ్రత ఎంతో అవసరమన్నారు. ఇంట్లోని చెత్తను ఎక్కడికక్కడ పడవేయకుండా డంపర్ బిన్‌లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సెల్వీయా, టీచర్లు ఈర్ల దేవి, మాధవి, కళావతి, రమణమ్మ, సచివాలయ శానిటరీ కార్యదర్శి పాల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 13ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఏక్ తారీక్ ఏక్ గంట కార్యక్రమంపై చక్కని ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి.సన్యాసినాయుడు, విద్యాసాగర్, భగవాన్ పాల్గొన్నారు.
- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసరాలను ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.కోటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ టి.టి.వి.రామం, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొని ప్రధాన వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 20వ వార్డులో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని వీధులను శుభ్రం చేశారు.


16వ వార్డు రజకవీధిలో శుభ్రం చేస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏసీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు


కృష్ణా కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు


22వ వార్డులో శ్రమదానం చేస్తున్న పీతల గోవింద్

క్లుప్తంగా

సీనియర్ ఓటర్లకు ఘన సన్మానం


వృద్ధులైన ఓటర్లను సన్మానం చేస్తున్న

మద్దిలపాలెం: వృద్ధులైన సీనియర్ ఓటర్లను తూర్పు నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.వి.ఎస్.ఎస్. రామమోహనరావు పితాపురం కాలనీ సచివాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 ఏళ్ల పైబడిన నలుగురు వృద్ధ ఓటర్లను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు యామిని, సుధాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


ద్విచక్ర వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. మద్దిలపాలెం సిగ్నల్ కూడలి వద్ద హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనచోదకులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారితో హెల్మెట్ ధారణపై ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ ధరించిన వాహనచోదకులకు చాకెట్లు అందించి అభినందించారు. ఫ్రెండ్లీ పోలింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ట్రాఫిక్ ఎస్‌ఐ కనకరాజు తెలిపారు.

డయాలసిస్ రోగులకు పెన్షన్ అందజేత


రోగులకు పెన్షన్ అందిస్తున్న నాగరాజు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో పలువురు డయాలసిస్ రోగులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. ఆదివారం ఉదయం శెట్టి బలిజ వారి వీధిలో లబ్ధిదారులకు డయాలసిస్ పెన్షన్ రూ.10 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది లక్ష్మణరెడ్డి, నీలాపు రమణారెడ్డి, మంగరాజు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎవరి పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలు తెలియపరచాలన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

అంబేడ్కర్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్‌గా రాజుకుమార్


రాజుకుమార్

మద్దిలపాలెం: డాక్టర్. వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల డాక్టర్.బి.ఆర్ అంబేడ్కర్ ప్రాంతీయ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్‌గా జి.రాజుకుమార్‌ను నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. ఆయన కళాశాల కామర్స్ విభాగాధిపతిగా ఉన్నారు.

అద్భుతం చైతన్య దీపిక కూచిపూడి నృత్యం


కూచిపూడి నృత్య ప్రదర్శనలో చైతన్య దీపిక

మద్దిలపాలెం : స్టాఫ్‌వేర్ రంగంలో రాణిస్తున్న వేద చైతన్య దీపిక తన కూచిపూడి నృత్యంతో అబ్బురపరిచారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఆదివారం అరంగేట్రంలో దీపిక తన నాట్య విన్యాసంతో ఆకట్టుకున్నారు. గురువు వెంపటి చినసత్యం ప్రియ శిష్యుడు గురు శ్రీహరి రామమూర్తి ఆశీస్సులతో నేమాని విశ్వశాంతి మార్గదర్శకత్వంలో అరంగేట్రం వైభవంగా జరిగింది. స్టార్‌మేకర్ లంక సత్యానంద్, విజయకుమార్.. చైతన్య దీపికను ఆశీర్వదించారు. అనంతరం సుమారు రెండు గంటల పాటు నిర్విరామంగా చైతన్య దీపిక కూచిపూడి నాట్యంతో మంత్రముగ్ధులను చేశారు. అనంతరం దీపిక మాట్లాడుతూ తన అభిరుచులు గుర్తించిన అమ్మ, నాన్న తన 8వ ఏటనే తొలిసారిగా కూచిపూడి నాట్యంలో శిక్షణ ఉషారాణి వద్ద ఇప్పించారన్నారు. తర్వాత 12 ఏళ్ల వయస్సులో గురుశ్రీహరి రామమూర్తి దగ్గర శిష్యులుగా చేరి కూచిపూడిలో పట్టుసాధించానన్నారు.

యువ ఆవిష్కరణలకు టెక్ లీగ్ అద్భుత వేదిక

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- టెక్ లీగ్–2023కు 160 టీమ్‌ల హాజరు


మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


పోటీలకు హాజరైన 160 టీమ్స్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: యువ ఆవిష్కరణలకు టెక్ లీగ్ అద్భుతమైన వేదిక అని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ భాగస్వామ్యంతో టెక్ టీమ్ సొల్యూషన్స్, ఏయూ ఎ–హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్ లీగ్–2023 పోటీలకు ఎంపికైన విద్యార్థుల సమావేశం ఆదివారం ఏయూలోని వైఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు ఆవిష్కరణల దిశగా ముందడుగు వేసేందుకు కావాల్సిన అన్ని అవకాశాలు, సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికత సహకారాన్ని అందిపుచ్చుకుని ఆవిష్కరణలే లక్ష్యంగా విద్యార్థులు ఆలోచనలు చేయాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేందుకు ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. టెక్ లీగ్ వంటి పోటీల ద్వారా విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాటు ఇతరులు చేసిన ఆవిష్కరణలపైనా విజ్ఞానం పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ర్యాంకుల కోసం, మార్కుల కోసం కాకుండా ఆల్ రౌండర్స్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కొన్ని విద్యా సంస్థలు ర్యాంకులు, మార్కులు దిశగా చేసే ప్రకటనలకు, ప్రలోభాలకు ఆకర్షితులై పిల్లలను ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనాత్మక దృక్పథం పెరిగేలా సహకారం అందించాలన్నారు. ఏయూ ఎ–హబ్ సీఈవో డాక్టర్ రవి ఈశ్వరపు మాట్లాడుతూ ఈ టెక్ లీగ్ పోటీలకు 160 టీమ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థులను పరిశోధనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలు దిశగా ప్రోత్సహించడమే టెక్‌లీగ్–2023 లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, టెక్ టీమ్ సొల్యూషన్స్ సీఈవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు అరికట్టాలి


జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

మహారాణిపేట : గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో సరైన వైద్యం చేయించుకోక మరణాలు సంభవిస్తున్నాయని, ఆర్‌ఎంపీ వైద్యులు దీనికి అడ్డుకట్ట వేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. రామ్‌నగర్‌లోని జేవీవీ నాయకుడు సోమేష్ మాస్టారు స్వగృహానికి విచ్చేసిన ఆయనను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో పలువురు ఆర్‌ఎంపీ వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ అమాయక ప్రజల మూఢ నమ్మకాలను పారద్రోలడంతో పాటు డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యునిగా కూడా గుర్తింపు పొందారని ప్రశంసించారు. విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటరావు, మురళి, చిరంజీవి, భాస్కరరావు, జేవీవీ నాయకులు గోపాల్ నాయక్, బాషా, స్వామి నాయుడు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా బైక్ ర్యాలీ


ముడసర్లోవ వద్ద సీపీఎం బైక్ రాలీలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లోకనాథం

ఆరిలోవ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన బైక్ ర్యాలీ ఆదివారం ఆరిలోవ చేరింది. ఈ సందర్భంగా ఈ యాత్రకు ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఇందులో భాగంగా ముడసర్లోవ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 5న కూర్మన్నపాలెంలో జరగనున్న బహిరంగ సభకు నగర ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రధానమంత్రి మోదీ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాయకులు పి.మణి, నరేంద్రకుమార్, పి.శంకరరావు, కె.సత్యనారాయణ, రాజు, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వైద్య విద్యార్థి పరిస్థితి విషమం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గీతం కళాశాలలో వైద్య విద్య అభ్యసిస్తున్న లోకేష్, మనోజ్‌రెడ్డి, జంపాన సుజిత్ వర్మ ఆదివారం ఉదయం కారులో భీమిలి నుంచి రుషికొండ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రామాద్రి వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న లారీని కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు టైరు ఒకటి వేరుకాగా కారు ముందుభాగం నుజ్జునుజ్జైంది. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో ముందు కూర్చున్న మనోజ్ రెడ్డి, లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెనుక కూర్చున్న జంపాన సుజిత్ వర్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా సుజిత్ వర్మను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మనోజ్ రెడ్డి అతివేగంగా కారు నడపడమే ప్రమాదానికి కారణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సుజిత్ వర్మ తండ్రి జంపాన శ్రీనివాస్‌రావు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిది రాజమండ్రి కాగా ముగ్గురూ చదువు నిమిత్తం ఎండాడలో నివసిస్తున్నారు.

నవ్వులు పూయించిన కామెడీ షో


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ హ్యూమర్ క్లబ్ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ రత్న కామెడీ, హాస్య ప్రియ, హాస్య దర్బారు క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వించారు. వీటిలో లాయర్ పరాంకుశం, బట్టల షాపు, పేకాట రాదన్నావు, కవితల ఆవిష్కరణ, మూడు మాత్రలు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, నాయుడు, పుష్యమి, అనూరాధ, కుమారి, పోర్టు శేషు, శ్రీధర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పూయించాయి. అనంతరం యువ నాటకోత్సవాల్లో ముళ్ల తేగలు, ఇంతింతే నాటకాలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు.

జోన్–1లో ఏఎస్‌ఆర్ జిల్లాను కొనసాగించాలి


నినాదాలు చేస్తున్న గిరిజాగృతి నాయకులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లా(ఏఎస్ఆర్)ను జోన్–1లోనే కొనసాగించాలని గిరిజాగృతి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో గిరిజాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం మాట్లాడారు. ఏఎస్ఆర్ జిల్లాను జోన్–1లో ఉంచితేనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. లేకుంటే విద్యార్థులు, ఉద్యోగులతో పాటు స్థానిక ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాల కల్పన విషయంలో తీరని నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు లకే చిట్టిబాబు, బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వీచిక


యారాడ పార్కులో కలుసుకున్న 1991-92 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పెదగంట్యాడ: ఆహ్లాదకర యారాడ తీరం స్మృతుల పరిమళాన్ని అద్దుకుంది. 30 ఏళ్ల అనంతరం కలుసుకున్న మిత్ర బృందం ఆనందానికి ఆకాశమే హద్దయింది. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు ఒకచోట చేరడంతో కోలాహలం నెలకొంది. 1991–92 విద్యా సంవత్సరంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఉదయం యారాడ తీరంలో కలుసుకున్నారు. ఒకరినొకరు చూసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో చేసిన అల్లర్లను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరి ఆర్థిక పరిస్థితులను మరొకరు తెలుసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ తోటి వారికి చేయూతనందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా వారంతా ఒక అసోసియేషన్ ఏర్పడ్డారు.. కష్టాల్లో ఉన్న వారి కన్నీళ్లు తుడిచేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమా, గొందేశి పెంటయ్యరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, దొమ్మేటి అప్పారావు, దొమ్మేటి కనకారావు, ధర్మాల కనకరెడ్డి, పంతుల ప్రసాద్, కృష్ణవేణి, అరుణ పాల్గొన్నారు.

షాడోగ్రఫీపై పిల్లలకు శిక్షణ


వర్చువల్ సెషన్ ద్వారా పిల్లలకు షాడోగ్రఫీలో టెక్నిక్స్ నేర్పుతున్న రేఖావ్యాస్

సీతంపేట: ముంబైకి చెందిన షాడో గ్రాఫిస్ట్ రేఖా వ్యాస్ వర్చువల్ సెషన్ ద్వారా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీలో పిల్లలకు హ్యాండ్ షాడోగ్రఫీని నేర్పించారు. చాలా మందికి కథలు చదవడం, వినడం ఇష్టపడతారని, పప్పెట్ షో, షాడోగ్రఫీతో కథలు చెప్పినపుడు ఆనందం రెట్టింపవుతుందని ఆమె అన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పిల్లల్లో వినోదం, సృజనాత్మకత కల్పనను రేకెత్తిస్తాయని, పఠనాశక్తిని, పుస్తకాలపై ప్రేమను కలిగిస్తాయన్నారు. రేఖా వ్యాస్ ఇంటరాక్షన్ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించి షాడోగ్రఫీలో లీనమయ్యేలా చేసింది. షాడోగ్రఫీతో ఎలా కథలు చెప్పాలి, దానికి సంబంధించిన ఉపాయాలు, టెక్నిక్స్, కొన్ని రకాల హ్యాండ్ షాడోలు ఎలా తయారు చేయాలో పిల్లలకు నేర్పించారు.

బియ్యం, కందిపప్పు స్పెషల్ కౌంటర్‌లో తనిఖీలు

సీతమ్మధార: ప్రభుత్వ ఆదేశాలతో రాయితీపై అందిస్తున్న బియ్యం, కందిపప్పుపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లోని ప్రత్యేక కౌంటర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, అప్పారావు తనిఖీలు నిర్వహించారు. కందిపప్పు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. కాటాలు తనిఖీ చేశారు. వాటిని కొనుగోలు చేసిన వినియోగదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.